# ప్రజాస్వరం

PRAJASWARAM

తెలుగు దినపత్రిక

MHR TV

www.MHRtv.com

మెదక్ | సంపుటి: 18 సంచిక: 166 | సోమవారం, 28 ఏప్రిల్ 2025 | పేజీలు: 06 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamada-Vijayawada-Guntur-Vizag Adilabad Kurnool | www.prajaswaramdaily.com




# తెలంగాణకు విలన్ కాంగ్రెస్సే



## కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తారా.. ఇది సాధ్యమా..?

- మన సభకు ప్రజలు రాకుండా అనేక ఆటంకాలు సృష్టిస్తున్నారు..
- పోలీసులు ఎందుకు తొందర పడుతున్నారు..
- బీఆర్ఎస్ సోషల్ మీడియా యాక్టివిస్టులను ఎందుకు అరెస్ట్ చేస్తున్నారు
- పోలీసులు ఇవాళ డైరీలో రాసుకోవాలి.. మళ్లీ వచ్చేది బీఆర్ఎస్సే..
- బీఆర్ఎస్ సభల్ని ఆపుతారా..
- ఈ ప్రభంజనాన్ని ఎలా ఆపుతారు: కేసీఆర్

**హైదరాబాద్ ఏప్రిల్ 27(ప్రజాస్వరం):**


తెలంగాణ రాష్ట్రానికి కాంగ్రెస్ పార్టీ విలన్ నంబర్ 1 అని భారాస అధినేత కేసీఆర్ అన్నారు. 1956లో బలవంతంగా ఆంధ్రతో కలిపింది జవహర్‌లాల్ నెహ్రూ అయితే, 1969లో తెలంగాణ ఉద్యమం వస్తే.. మళ్లీ కాంగ్రెస్ పార్టీ నిరంకుశంగా అణచివేసిందని విమర్శించారు. అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడైనా తెలంగాణకు మొదటి విలన్ కాంగ్రెస్ పార్టీయేనని వ్యాఖ్యానించారు. భారాస రజతోత్సవ వేడుకల సందర్భంగా హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో కేసీఆర్ పాల్గొన్నారు. తొలుత జమ్ముకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపంగా నిమిషం పాటు మౌనం పాటించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ... వలసవాదుల విషకౌగిలిలో నలిగిపోతున్న నా భూమికి విముక్తి కల్పించాలనే లక్ష్యంతో ప్రత్యేక తెలంగాణ సాధన కోసం ఒక్కడినే బయల్దేరానని అన్నారు. ఆ సమయంలో కొందరు వెటకారం చేశారని, అన్నింటినీ అధిగమించి పోరాడి తెలంగాణను సాధించానని చెప్పారు. ప్రజలు దీవిస్తే పదేళ్లపాటు ధగధగలాడే తెలంగాణను తయారు చేసుకున్నామన్నారు. "1969లో మూగబోయిన తెలంగాణ ఉద్యమానికి మళ్లీ జీవం పోశాను. కొండా లక్ష్మణ్ బాపూజీ నివాసమైన జలదృశ్యం వేదికగా తెరాస ఆవిర్భావం జరిగింది. ఉద్యమ జెండాను దించితే నన్ను రాళ్లతో కొట్టి చంపమని ఆనాడు చెప్పాను. 60 ఏళ్ల సమైక్య పాలనలో

మిగతా 2వ పేజీలో..

## ఈఎన్‌సీ హరిరామ్ కు 14 రోజుల రిమాండ్..

- రూ.200 కోట్లకు పైగా అక్రమ ఆస్తులు గుర్తింపు
- ఏకకాలంలో 14 ప్రదేశాల్లో ఏసీబీ సోదాలు



2

## పాకిస్తానీయులకు లీవ్ ఇండియా పేరుతో నోటీసులు.

- హైదరాబాదులో మొత్తం 230 మంది
- 199 మందికి లాంగ్ టర్మ్ వీసాలు, 31 మందికి షార్ట్ టైం వీసాలు



2

## ప్రపంచం మొత్తం భారత్ వైపే..



2

బాధితులకు న్యాయం జరుగుతుందని

**నేను హామీ ఇస్తున్నా..**

- మన్‌కీ బాత్ కార్యక్రమలో ప్రసంగించిన మోడీ
- పహల్గాం ఉగ్రవాద దాడిపై స్పందించిన ప్రధాని
- ఉగ్రవాదులు పిరికితనాన్ని ప్రదర్శించారు
- ప్రతి భారతీయుడు కోపంతో మండిపోతున్నారు
- **ప్రతి భారతీయుడి రక్తం మరుగుతోంది..**
- బాధితులకు తప్పకుండా న్యాయం జరుగుతుంది
- ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వ్యాఖ్యలు

## తెలంగాణ కొత్త సీఎస్ గా కె. రామకృష్ణారావు



2

రేవంత్‌రెడ్డితో శాంతి చర్చల కమిటీ

## నేతల సమావేశం

మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలు జరిపేలా చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి



2

## తెలంగాణలో భారీ వర్షాలు

22 జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్

పలు జిల్లాల్లో కురుస్తున్న వర్షం




2

కర్రెగుట్ట కూంబింగ్ లో

## బిగ్ ట్విస్ట్..

- భారీ సొరంగాన్ని గుర్తించిన భద్రతా బలగాలు..
- **మావోయిస్టుల ఆచూకీ కోసం గాలింపు..**



2

www.prajaswaramdaily.com WWW.PRAJASWARAMDAILY.COM

# పాకిస్తానీయులకు లీవ్ ఇండియా పేరుతో నోటీసులు..

- హైదరాబాదులో మొత్తం 230 మంది
- 199 మందికి లాంగ్ టర్మ్ వీసాలు, 31 మందికి షార్ట్ టైం వీసాలు

**హైదరాబాద్ ఏప్రిల్ 27(ప్రజాస్వరం):**

పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్ పాక్ పై దౌత్య దాడికి దిగింది. ఇందులో భాగంగా భారత్ లో ఉన్నటువంటి పాక్ పౌరులను ఆ దేశానికి పంపించేందుకు చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో హైదరాబాదులోని పాకిస్తానీయులకు లీవ్ ఇండియా పేరుతో నోటీసులు అందజేశారు అధికారులు. హైదరాబాదులో మొత్తం 230 మంది పాకిస్తానీయులు ఉన్నట్లు గుర్తించారు. 199 మందికి లాంగ్ టర్మ్ వీసాలు, 31 మందికి షార్ట్ టైం వీసాలు ఉన్నాయని గుర్తించారు.

షార్ట్ టర్మ్ వీసాలు ఉన్న ఎనిమిది మందికి దేశం విడిచిపోవాలని నోటీసులు జారి చేశారు. మెడికల్ వీసాలు తీసుకున్న వారికి ఈ నెల 29 వరకు గడువు విధించారు. పాకిస్తానీయులు తెలంగాణ రాష్ట్రం విడిచి వెళ్లిపోవాలని డిజిపి జితేందర్ ఆదేశాలు జారీ చేశారు. షార్ట్ టర్మ్ వీసాలు ఉన్నవారు దేశం విడిచి వెళ్లాలని ఆదేశించారు. అధికారుల ఆదేశాలతో పాకిస్తానీయులు స్వదేశానికి వెళ్తున్నారు. వాఘాఅట్టారీ బార్డర్ కు చేరుకుంటున్నారు. బార్డర్ వద్ద గంభీర వాతావరణం నెలకొంది.

# ప్రపంచం మొత్తం భారత్ వైపే..

- బాధితులకు న్యాయం జరుగుతుందని నేను హామీ ఇస్తున్నా..
- మన్‌కీ బాత్ కార్యక్రమలో ప్రసంగించిన మోడీ
- పహల్గాం ఉగ్రవాద దాడిపై స్పందించిన ప్రధాని
- ఉగ్రవాదులు పిరికితనాన్ని ప్రదర్శించారు
- ప్రతి భారతీయుడు కోపంతో మండిపోతున్నారు
- ప్రతి భారతీయుడి రక్తం మరుగుతోంది..
- బాధితులకు తప్పకుండా న్యాయం జరుగుతుంది
- ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ ఏప్రిల్ 27(ప్రజాస్వరం):**

పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడి తర్వాత ప్రపంచవ్యాప్తంగా ప్రజలు సంతాపం వ్యక్తం చేశారని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. తన హృదయం చాలా విచారంగా ఉందని.. ప్రతి భారతీయుడు కోపంతో మండిపోతున్నారని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈరోజు మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రసంగించారు. పహల్గాంలో ఉగ్రవాదులు పిరికితనాన్ని ప్రదర్శించారని విమర్శించారు. శత్రువులకు దేశ అభివృద్ధి నచ్చడం లేదని.. దాడి చేసిన ఉగ్రవాదులను వదిలిపెట్టబోమని హెచ్చరించారు. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పునరుద్ఘాటించారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రపంచం మొత్తం భారత్‌కు అండగా నిలిచిందని.. పహల్గాం బాధితులకు తప్పకుండా న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు.

"కశ్మీర్‌లో శాంతి తిరిగి నెలకొంటోంది. ప్రజాస్వామ్యం బలపడుతోంది. పర్యటకుల సంఖ్య పెరుగుతోంది. శత్రువులకు ఇది నచ్చడం లేదు. ఉగ్రవాద నాయకులు కశ్మీర్‌ను మళ్లీ నాశనం చేయాలని కోరుకుంటున్నారు. అందుకే ఇన్ని కుట్రలు పన్నుతున్నారు. ఈ తరుణంలో మన సంకల్పాన్ని బలోపేతం చేసుకోవాలి. ఈ సవాలును ధీటుగా ఎదుర్కోవాలి. బాధిత కుటుంబాలకు న్యాయం జరుగుతుందని నేను హామీ ఇస్తున్నాను. దాడికి పాల్పడిన వారికి అత్యంత కఠినమైన శిక్ష విధిస్తాం." అని ప్రధాని మోడీ వ్యాఖ్యానించారు. అనంతరం.. ఇస్రో మాజీ చీఫ్, శాస్త్రవేత్త కె. కస్తూరిరంగన్ కు ప్రధాని నరేంద్ర మోడీ నివాళులర్పించారు. కస్తూరిరంగన్ తన జీవితాంతం నిస్వార్థంగా దేశానికి సేవ చేశారని కొనియాడారు. దేశాభివృద్ధికి ఆయన చేసిన కృషిని ఎప్పటికీ మర్చిపోలేమని స్పష్టం చేశారు.

# కర్రెగుట్ట కూంబింగ్ లో బిగ్ ట్విస్ట్..

- భారీ సొరంగాన్ని గుర్తించిన భద్రతా బలగాలు..
- మావోయిస్టుల ఆచూకీ కోసం గాలింపు..

**హైదరాబాద్ ఏప్రిల్ 27(ప్రజాస్వరం):**


గత ఆరు రోజులుగా కర్రె గుట్టలలో భద్రతా బలగాలు కూబింగ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నాయి.. ఈ ఆపరేషన్ లో కీలక పరిణామం చోటు చేసుకుంది. బీజాపూర్, తెలంగాణ సరిహద్దు కర్రె గుట్టలలో భారీ సొరంగాన్ని భద్రతా బలగాలు గుర్తించారు. ఈ సొరంగంలో ఒక ప్రాంతం నుంచి మరో మార్గం ద్వారా బయటికి వెళ్లేందుకు వీలుగా ఉందని భద్రతాదళాలు చెబుతున్నాయి. గత కొన్ని రోజులుగా ఈ సొరంగాన్ని స్థావరంగా చేసుకొని మావోయిస్టులు దాడులకు తెగబడ్డారని పేర్కొన్నాయి. అయితే, ఈ సొరంగంలో సరైన గాలి నీరు వాతావరణం ఉంది.. అంతే కాకుండా ఇక్కడ విశాలమైన ప్రాంతం కూడా ఉందన్నారు.ఈ సొరంగంలో 1000 మంది పట్టేంత స్థలం ఉందని అధికారులు వెల్లడించారు..

కాగా, కర్రెగుట్ట కొండల్లో నక్సలైట్లపై కొనసాగుతున్న ఆపరేషన్‌లో భద్రతా బలగాలు భారీ విజయం సాధించాయి. ఎండ వేడిమి, 45 డిగ్రీల ఉష్ణోగ్రతల మధ్య శ్రమించి.. ఎట్టకేలకు వారి స్థావరానికి చేరుకోగలిగారు. అయితే భద్రతా దళాలు అక్కడికి చేరుకోకముందే మావోయిస్టులు తమ స్థావరాన్ని మార్చుకున్నట్లు సమాచారం. ఎందుకంటే ఇక్కడ వారు ఉన్నట్టు ఆనవాళ్లు దొరికాయి. ఈ గుహలో చాలా రోజుల పాటు వెయ్యి మందికి పైగా ఆశ్రయం పొందవచ్చని చెప్పుకొచ్చారు. ఈ సొరంగానికి సంబంధించిన ఫోటోలు, వీడియోలను చిత్రీకరించారు.

ఇక, పెద్ద సంఖ్యలో మావోయిస్టులు కూడా డీహైడ్రేషన్ బారిన పడుతున్నారు. ఈ కూంబింగ్ ప్రారంభమైనప్పటి నుంచి నక్సలైట్లు ఆహారం, మంచి నీటి కోసం వెంపర్లాడినట్లు తెలుస్తుంది. నక్సలైట్లు తమను తాము సురక్షితంగా ఉంచుకోవడానికి సుమారు 4 నెలల పాటు రేషన్‌తో కర్రెగుట్ట కొండలలో క్యాంప్ ఏర్పాటు చేసుకున్నప్పటికీ.. భద్రతా బలగాలు కర్రెగుట్టను చుట్టుముట్టడంతో.. ఆ రేషన్ కూడా వారికి ఉపయోగపడలేదు.. కొండలపై నుంచి దిగితే సైనికుల తూటాలకు బలి అవుతారనీ, భయంతో కొండలపైనే ఎక్కువ కాలం దాక్కుని ఉంటే డీహైడ్రేషన్ వల్ల చనిపోతామనే భయం వారిని వెంటాడుతుంది. మరోవైపు, నక్సలైట్లు దాక్కున్న కొండలను మొత్తం స్వాధీనం చేసుకునే వరకు ఈ ఆపరేషన్ కొనసాగించాలని భద్రతా దళాలు పట్టుదలతో ఉన్నాయి. ఇక, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాంతి చర్చలకు చొరవ చూపాలంటూ ఇటీవల నక్సలైట్లు ప్రెస్ నోట్ విడుదల చేశారు.

## ఈఎన్‌సీ హరిరామ్ కు
# 14 రోజుల రిమాండ్..

- రూ.200 కోట్లకు పైగా అక్రమ ఆస్తులు గుర్తింపు
- ఏకకాలంలో 14 ప్రదేశాల్లో ఏసీబీ సోదాలు



**హైదరాబాద్ ఏప్రిల్ 27(ప్రజాస్వరం):**

కాళేశ్వరం ప్రాజెక్టు ఇంజనీరింగ్ చీఫ్ ఈఎన్‌సీ హరి రామ్ ఇంట్లో ఏసీబీ సోదాలు ముగిశాయి. అనంతరం పోలీసులు ఆయనను అర్ధరాత్రి సమయంలో జడ్జి ముందు ప్రవేశపెట్టారు. విచారణ జరిపిన న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారు. రూ. 200 కోట్లకుపైగా అక్రమ ఆస్తులు కలిగి ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. హరిరామ్ ఇంటితోపాటు ఏకకాలంలో 14ప్రదేశాల్లో సోదాలు నిర్వహించారు. గజ్వేల్‌లో భారీగా అక్రమాస్తులను అధికారులు గుర్తించారు. మార్కుర్‌లో 28 ఎకరాల భూమి, కొండాపూర్ షేక్‌పేట్, శ్రీనగర్, మాదాపూర్ ప్రాంతాల్లో ఖరీదైన ఫ్లాట్లను గుర్తించారు. పటాన్ చెరువులో 20 గుంటల భూమి, ఆరెకరాల మామిడి తోట, ఫామ్ హౌస్ ఉన్నట్లు పేర్కొన్నారు. కాగా కాళేశ్వరం ప్రాజెక్టు ఈఎన్‌సీ భూక్యా హరిరామ్ ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో శనివారం అరెస్టు అయ్యారు. కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ల మార్పు వ్యవహారంలో భారీ స్థాయిలో అవినీతి జరిగిందని, ఇందులో హరిరామ్ కీలకపాత్ర పోషించారనే ఆరోపణలు చాలాకాలంగా ఉన్నాయి.

# తెలంగాణకు విలన్ కాంగ్రెస్సే..



మొదటిపేజీ తరువాయి

తెలంగాణ ప్రజలు ఎన్ని బాధలు పడ్డారో నాకు తెలుసు. ఆనాడు కాంగ్రెస్, తెదేపాలో ఉన్న నేతలు పదవుల కోసం పెదాలు మూసుకొని కూర్చున్నారు. శాసనసభలో తెలంగాణ అనే పదమే ఉపయోగించవద్దని రూలింగ్ ఇచ్చారు. తెరాస ఏర్పాటు తర్వాత మలిదశ ఉద్యమం ఉద్ధృతమైంది. సాగరహారం, వంటావార్పు, సకలజనుల సమ్మె వంటి కార్యక్రమాలతో ఉద్యమాన్ని ఉద్ధృతం చేశాం.

సాధించుకున్న తెలంగాణలో ప్రజలు దీవించి పదేళ్లపాటు అవకాశమిస్తే.. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాం. ప్రాజెక్టులు నిర్మించి సాగుభూమిని గణనీయంగా పెంచాం. మూడేళ్లలోనే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించాం. అద్భుతమైన తెలంగాణను నిర్మించుకున్నాం. పంజాబ్‌ను తలదన్నేలా పంటలు పండే రాష్ట్రాన్ని నిర్మించుకున్నాం. షేర్‌షా కాలం నుంచి స్వాతంత్ర్యం వచ్చే వరకు రైతుల నుంచి ఎన్నో పన్నులు వసూలు చేశారు. వారి నుంచి పన్నులు వసూలు చేసిన వారే తప్ప.. వారికి మేలు చేసిన వాళ్లు లేరు. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే పట్టించుకున్న నాథుడు లేడు.

**ఎన్నోన్నో పథకాలు అమలు చేశాం**

రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు రైతుబంధు పథకం తీసుకొచ్చాను. రైతుబీమా అమలు చేసి రైతు కుటుంబాలను ఆదుకున్నాం. భారాస హయాంలో రైతుబంధు పథకం నిరాటంకంగా అమలైంది. వానాకాలం, యాసంగి పంటలకు సకాలంలో రైతుబంధు జమచేశాం. ఎన్నికల అజెండాలో చెప్పని ఎన్నో పథకాలను అమలు చేశాం. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, కల్యాణలక్ష్మి, చేపల పెంపకం వంటివి అమలు చేశాం. రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించి ఉద్యోగ అవకాశాలు పెరిగేలా చేశాం. రాష్ట్రంలో 3 మాత్రమే ఉన్న వైద్య కళాశాలల సంఖ్యను 33కి పెంచాం.

**తెలంగాణకు ఏం బీమారి వచ్చింది?**

ఎన్నో అద్భుతాలు సాధించుకున్న తెలంగాణకు ఇవాళ ఏం బీమారి వచ్చింది. కాంగ్రెస్ నేతలు ఎన్నికల ముందు ఎన్నెన్నో చెప్పారు. దిల్లీ నుంచి వచ్చిన నకిలీ గాంధీలు ఎన్నో హామీలిచ్చారు. పింఛను రూ.2 వేలు ఉంటే కాంగ్రెసోళ్లు రూ.4 వేలు వేస్తామన్నారు. మేం రైతుబంధు రూ.10వేలు ఇస్తే.. రూ.15 వేలు ఇస్తామని కాంగ్రెస్ చెప్పింది. చదువుకునే విద్యార్థినులకు స్కూటీలు ఇస్తామన్నారు. రూ.2 లక్షల రుణమాఫీని ఒక్క సంతకంతో రద్దు చేస్తామని చెప్పారు. కల్యాణలక్ష్మి పథకంలో రూ.లక్షతోపాటు తులం బంగారం ఇస్తామన్నారు. ఇప్పటికీ పింఛన్లు పెరగలేదు, రుణమాఫీ పూర్తి కాలేదు. ఎన్నో మాటలు చెప్పి ప్రజలను ఏమార్చారు.

ఉచిత బస్సులు పెట్టి మహిళలు జుట్లు పట్టుకొని కొట్టుకునే పరిస్థితి తెచ్చారు. ప్రతి చెడు విషయానికి కేసీఆర్ కారణమని చెబుతున్నారు. మమ్మల్ని ఎవరూ నమ్మడం లేదు.. అప్పు పుడతలేదని దివాలా మాటలు మాట్లాడుతున్నారు. హామీల గురించి అడిగితే.. సంక్రాంతి, మార్చి అంటూ గడువులు చెబుతున్నారు. నా కళ్లముందే తెలంగాణ ఇలా అయిపోతుంటే దుఃఖం వస్తోంది. మళ్లీ కరెంట్ కోతలు, మోటార్లు కాలిపోయే రోజులు వచ్చాయి. కేసీఆర్ మంచిగా ఇచ్చిన కరెంట్‌కు ఇవాళ ఏమయిందని అడుగుతున్నాం. భూములు ధరలు ఎందుకు తగ్గాయి? నీళ్లు ఎక్కడికి పోయాయి? వడ్లు కొనే దిక్కులేదు.. కల్లాల్లో రైతులు ఏడుస్తున్నారు. 2014కు ముందున్న పరిస్థితులు మళ్లీ వచ్చాయి'' అని భారాస అధినేత కేసీఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

**ఇకపై బయటకు వస్తా.. ప్రజలన తరపున పోరాడతా**

'' పాలన చేతకాక రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాలా తీయించారు. 8090శాతం పూర్తయిన ప్రాజెక్టులను పూర్తి చేయకుండా పక్కన పెట్టారు. పేద మహిళల కోసం తీసుకువచ్చిన కేసీఆర్ కిట్ పథకం కూడా బంద్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి కొన్నాళ్లు సమయం ఇవ్వాలని ఇన్నాళ్లు బయటకు రాలేదు. ఇప్పటి నుంచి బయటకి వస్తా.. అందరి తరపున పోరాడతా. ఇప్పటికైనా ప్రజలు ఆలోచించి తెలివితో పని చేయాలి. ఎక్కడ పోగొట్టుకున్నామో మళ్లీ అక్కడే సాధించాలి. మాట్లాడితే భారాసపై నిందలు వేస్తున్నారు. భూములు అమ్మొచ్చు.. అభివృద్ధి చేయొచ్చు కానీ, ఏది అమ్మాలో విచక్షణ ఉండాలి. ఎక్కడైనా యూనివర్సిటీ భూములు అమ్ముతారా?'' అని కేసీఆర్ ప్రశ్నించారు.

**రాజీవ్ ఆరోగ్యశ్రీని కొనసాగించా**

''ఎవరు తెచ్చినా.. బాగున్న పథకాన్ని కొనసాగించాలని నేను ఆనాడే చెప్పాను. వైఎస్ఆర్ తీసుకొచ్చిన ఆరోగ్యశ్రీ పథకాన్ని నేను రద్దు చేయలేదు. పేరు మార్చకుండా ఆ పథకాన్ని కొనసాగించాను. ప్రభుత్వాన్ని సామాజిక మాధ్యమాల్లో ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వారిపై పోలీసులు కేసులు పెడుతున్నారు. పోలీసులకు చెబుతున్నా.. డైరీల్లో రాసుకోండి.. మళ్లీ వచ్చేది భారాస ప్రభుత్వమే. భారాస ప్రభుత్వాన్ని ఆపడం ఎవరి తరమూ కాదు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా.. భారాస ప్రభంజనాన్ని ఎవరూ ఆపలేరు. కార్యకర్తలకు భారాస లీగల్ సెల్ అండగా ఉంటుంది. ఈ ప్రభుత్వం అన్ని విషయాల్లో విఫలమైంది. 2030శాతం కమీషన్లు తీసుకుంటూ సంచులు మోస్తోంది. అసెంబ్లీకి రావాలని నాకు సవాల్ విసురుతున్నారు. పిల్లలు అడిగితేనే చెప్పే దిక్కులేదు.. నేను కావాలా? కమీషన్ల గురించి అసెంబ్లీలో హరీశ్‌రావు ప్రశ్నిస్తే.. భుజాలు తడుముకుంటున్నారు.

**ఆపరేషన్ కగార్ ఆపేయాలి**

భాజపా వైఖరి అంతా భభ్రమానం..భజగోవిందం. శుష్క ప్రియాలు.. శూన్య హస్తాలు. ఆపరేషన్ కగార్ అనే పేరుతో ఛత్తీస్‌గఢ్‌లో గిరిజనులు, యువతను ఊచకోత కోస్తున్నారు. చర్చలకు పిలవాలని నక్సలైట్లు కోరుతున్నారు. వాళ్ల విజ్ఞప్తి మేరకు నక్సలైట్లను చర్చలకు పిలవాలి. బలగాలు ఉన్నాయని అందర్నీ చంపుతూ వెళ్తే.. ప్రజాస్వామ్యం అనిపించుకోదు. ఆపరేషన్ కగార్ తక్షణమే నిలిపివేయండి. ఆపరేషన్ కగార్ ఆపాలని తీర్మానం చేసి దిల్లీకి పంపుదాం'' అని కేసీఆర్ అన్నారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వల్లనే
# మాదిగలకు 9 శాతం రిజర్వేషన్

- మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి
- వర్గీకరణకు మద్దతు తెలిపిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు

**మేడ్చల్, ఏప్రిల్ 27 (ప్రజాస్వరం ) :** మాదిగలకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదిస్తూ తొమ్మిది శాతం రిజర్వేషన్ ఇచ్చే విధంగా కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి అన్నారు, నిజామాబాద్ వెళ్తూ మేడ్చల్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కొద్దీ సేపు అయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మరియు సహచర మంత్రులు అందరూ కలిసి మాదిగలకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదిస్తూ తొమ్మిది శాతం రిజర్వేషన్ ఇచ్చే విధంగా కృషి చేశారన్నారు. మాదిగల చిరకాల స్వప్నం ఎస్సీ వర్గీకరణ కాంగ్రెస్ తోనే సాధ్యమవుతుందని ఎన్నిక సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నందుకు కాంగ్రెస్ పెద్దలందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నట్లు కూడా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గుండ్ల పోచంపల్లి మున్సిపల్ ఎస్సీ సెల్ అధ్యక్షులు కుండ భానుచందర్, కావలి చిన్నయ్య ముదిరాజ్, మీసాల మల్లేష్, కుండ ప్రవీణ్ కుమార్ నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.గుండ్ల పోచంపల్లి మున్సిపల్ ఎస్సీ సెల్ అధ్యక్షులు కుండ భానుచందర్ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకొని మాజీ కార్పొరేషన్ చైర్మన్ రవికి కు స్వీట్లు తినిపించారు.



# ఘనంగా బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకలు...

**పార్టీ జెండా ను అవిశరించిన పార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మ దేవేందర్ రెడ్డి..**

**మెదక్ ఏప్రిల్ 27 (ప్రజాస్వరం)**బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ పురస్కరించుకుని ఆదివారం మెదక్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ జెండా ను మెదక్ బీఆర్ఎస్ జిల్లా పార్టీ అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆకాంక్ష నెరవేర్చడం కోసం ఈ పార్టీ ఆవిర్భవించడం జరిగిందన్నారు. మోసపూరిత హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ కబంధ హస్తాల నుంచి రాష్ట్ర ప్రజలకు విముక్తి కల్పించడం కోసం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వారు ప్రతి చేస్తున్న విధానాలను ఎండగడుతూ బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ ఉంటుందన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎంతో మంది అమరులు అయ్యారని వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. రాష్ట్ర ప్రధాత, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ 14 సంవత్సరాలు పోరాటం చేసి తెలంగాణ రాష్టాన్ని సాధించి రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చి రాష్ట్రాన్ని ముందు వరుసలో నిలబెట్టారన్నారు. అనంతరం వరంగల్ _ఎల్కతుర్తిలో జరిగే రజతోత్సవ సభకు మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మపర్సన్ లావణ్య రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బట్టి జగపతి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, మాజీ సర్పంచ్ లు, మాజీ కౌన్సిలర్స్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# తెలంగాణలో భారీ వర్షా లు

- 22 జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్
- పలు జిల్లాల్లో కురుస్తున్న వర్షం

**హైదరాబాద్ ఏప్రిల్ 27(ప్రజాస్వరం):**

తెలంగాణలో పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ మేరకు 22 జిల్లాలకు ఆరెంజ్, ఏడు జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని పేర్కొంది. గంటకు 50 నుంచి 60 కి.మీ వేగంతో బలమైన ఈదురు గాలులు వీస్తాయని తెలిపింది. మరోవైపు.. ఇప్పటికే తెలంగాణలోని పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. నల్గొండ, యాదాద్రి భువనగిరి, మంచిర్యాల జిల్లాల్లో తెల్లవారుజాము నుంచి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురుస్తోంది. ఇక హైదరాబాద్‌లో ఉదయం నుంచి వాతావరణం చల్లబడింది. ఇవాళ సాయంత్రం హైదరాబాద్ సహా కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.



# తెలంగాణ కొత్త సీఎస్ గా కె. రామకృష్ణారావు

**హైదరాబాద్ ఏప్రిల్ 27(ప్రజాస్వరం):**



తెలంగాణ రాష్ట్ర కొత్త ఛీఫ్ సెక్రెటరీగా కె. రామకృష్ణారావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతమున్న సీఎస్ శాంతి కుమారి ఈ నెల 30న పదవీ విరమణ చేయనున్నారు. 1989 బ్యాచ్‌కు చెందిన ప్రస్తుత సీఎస్ శాంతికుమారి 2021 జనవరి నుంచి సీఎస్ గా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ తదుపరి ప్రధాన కార్యదర్శిగా కె.రామకృష్ణారావును నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 1991 బ్యాచ్‌కు చెందిన ఆయన ప్రస్తుతం ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. 2016 ఫిబ్రవరి నుంచి ఆర్థిక శాఖలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన పదవీ కాలం ఈ ఏడాది ఆగస్టుతో ముగియనుంది. పరిపాలనలో ప్రక్షాళన దిశగా సీఎం రేవంత్ చర్యలు చేపట్టారు. CMO లో కూడా మార్పులు చేర్పులు చేపట్టినట్లు సమాచారం.

# రేవంత్‌రెడ్డితో శాంతి చర్చల కమిటీ నేతల సమావేశం

- మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలు జరిపేలా చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి

**హైదరాబాద్ ఏప్రిల్ 27(ప్రజాస్వరం):**

జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో శాంతి చర్చల కమిటీ నేతలు సమావేశమయ్యారు. మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలు జరిపేలా చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కాల్పుల విరమణకు కేంద్రాన్ని ఒప్పించాలని ముఖ్యమంత్రి ని కోరారు నేతలు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు శాంతి చర్చల కమిటీ కన్వీనర్ జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ అన్వర్ ఖాన్, దుర్గాప్రసాద్, జంపన్న, రవి చందర్.

శాంతి చర్చల కమిటీ నేతలతో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ..నక్సలిజాన్ని మా ప్రభుత్వం సామాజిక కోణంలో మాత్రమే చూస్తుంది.. తప్ప శాంతిభద్రతల అంశంగా పరిగణించదు.. గతంలో నక్సలైట్లతో చర్చలు జరిపిన అనుభవం సీనియర్ నేత జానారెడ్డికి ఉంది.. ఈ అంశంపై సీనియర్ నేత జానారెడ్డి సలహాలు, సూచనలు తీసుకుంటాం.. మంత్రులతో చర్చించి ఒక నిర్ణయాన్ని తీసుకుంటామని తెలిపారు.



ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక





# ఎల్కతుర్తి సభ కు తరలిన గులాబీ దళం

**మనోహరాబాద్ , ఏప్రిల్ 27 (ప్రజాస్వరం ) :**
బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం మరింత పెరిగిందని మాజీ జెడ్పి చైర్ పర్సన్ హేమలత శేఖర్ గౌడ్ అన్నారు. వరంగల్ జిల్లా ఎల్కతుర్తి లో జరిగిన బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకలకు మండలం నుంచి తరలి వెళ్తూ ఆమె మాట్లాడారు. రానున్న కాలంలో ఏ ఎన్నికలు వచ్చినా బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు గెలుపు ఖాయమన్నారు. తెలంగాణ జాతిపిత , తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్వహించిన రజతోత్సవ సభకు మండలం నుండి గులాబీ నేతలు కార్యకర్తలు భారీగా తరలి వెళ్లడం అభినందనీయమన్నారు రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండ గట్టేలా ప్రణాళిక చేపడుతామన్నారు. బీఆర్ఎస్ పార్టీ చేసిన పనితీరును ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను చేపట్టిన అభివృద్ధి పనులను మరింత లోతుగా తీసుకెళ్తామన్నారు రజతోత్సవ సభకు తరలివచ్చిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు భారీ సంఖ్యలో సభకు తరలిన గులాబీ దండును చూసి ఆనందం కలుగుతుందని ప్రతి ఒక్కరికి అభినందనలు తెలియజేస్తున్నట్టు తెలిపారు. గులాబీ దండును మరింత బలంగా తయారు చేసేందుకు కేసిఆర్ సూచనలతో ముందుకెళ్లి రానున్న ఎన్నికల్లో ప్రతి స్థానాన్ని కైవసం చేసుకునే విధంగా ముందుకు సాగుతామన్నారు మండలం నుంచి తరలిన వాహనాల్లో గులాబీ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు.





# రాయపోల్‌లో భక్త మార్కండేయ విగ్రహ ప్రతిష్ఠ

**దౌల్తాబాద్, ఏప్రిల్ 27(ప్రజాస్వరం) :**
నేటి నుంచి భక్త మార్కండేయ స్వామి ప్రతిష్ఠోత్సవాలు అంగరంగ వైభవంగా మూడు రోజులపాటు ఉత్సవాలు రాయపోల్ మండల కేంద్రంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని పద్మశాలి సంఘం సభ్యులు తెలిపారు. రాయపోల్ మండల కేంద్రంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శ్రీ భక్త మార్కండేయ స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ ఉత్సవాలు సోమవారం నుంచి మూడు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు పేర్కొన్నారు. గ్రామంలో పద్మశాలి సంఘం సభ్యులు నూతనంగా ఆలయం నిర్మించారు. ఆలయాన్ని రంగురంగులతో అలంకరించి విద్యుత్ దీపాలతో ద్వేదీప్యమానంగా సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఉత్సవాలు మొదటి రోజైనా సోమవారం ఉదయం గణపతి పూజ,పుణ్య వచనం,ఋత్వికరణం, మాతృక పూజ, దేవత ఆహ్వానం,అఖండ దీపారాధన, వాస్తు యోగిని,నవగ్రహ క్షేత్రపాలక, అంకురారోపణ, సర్వతో భద్ర, మంటప పూజ,అగ్ని ప్రతిష్ట, జులాదివాసం, అవహిత దేవత పూజ, మంగళ హారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. అదే రోజు సాయంత్రం ద్వారా తోరణ పూజ, నిత్య హోమం, మూల మంత్ర హోమం, పూర్ణాహుతి,శిరాధివాసం, బలిహరణ,ఆరగింపు,తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. రెండో రోజు మంగళవారం ఉదయం గణపతి పూజ, అవహిత దేవతల పూజలు, హోమాలు, మూల మంత్ర హవనం, రుద్ర సుక్త, లక్ష్మి సుక్త, మాన్య సూక్త, హవనములు, ప్రసాద సంస్కారం, దాబ్యాధివాసం, శయ్యాదివసం, పుష్పాది వాసం, అవహేత పూజ, మంగళ హారతి,మంత్రపుష్పం,తీర్థ ప్రసాదం తదితర కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. ఉత్సవాలను చివరి రోజైన బుధవారం ఉదయం గణపతి పూజ, స్థాపిత దేవత పూజలు,మూలమంత్ర అవణములు, గర్త సంస్కారంలు.10:00 గంటలకు రోహిణ నక్షత్ర యుక్త మిధున లగ్న పుష్కరాంశమున యంత్ర ప్రతిష్ట శ్రీ భక్త మార్కండేయ స్వామి మూర్తి ప్రతిష్ట కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ప్రతి ప్రతిష్ట తర్వాత భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతిష్ట మహోత్సవాల ఉత్సవాలకు పురోహితులు వెంకటేశ్వర శర్మ,



త్రివేణి వేణుగోపాల శర్మ,పార్వతీ ఆంజనేయ శర్మ తదితర పురోహితులు హాజరవుతున్నట్లు తెలిపారు. రాయపోల్ తో పాటు ఆ గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి భక్త మార్కండేయ స్వామి ప్రతిష్ట మహోత్సవాలను విజయవంతం చేయాలని గ్రామ పద్మశాలి సంఘం పిలుపునిచ్చింది. ఇప్పటికే గ్రామంలో ఆలయం వద్ద కన్నుల పండుగ పూజా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. మార్కండేయ స్వామి ఉత్సవాల సందర్భంగా మండల కేంద్రంలో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.



# ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**మనోహరాబాద్, ఏప్రిల్ 27 (ప్రజాస్వరం ) :**
మనోహరాబాద్ మండలం కేంద్రం లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. మనోహరాబాద్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 20062007 సంవత్సరముకు చెందిన పూర్వ విద్యార్థులు దండుపల్లిలోని శుభం గార్డెన్ లో 18 సంవత్సరాల తర్వాత ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పట్లో చదువుకున్న పదవ తరగతి విద్యార్థులు అందరు ఈ సమ్మేళనం లో పాల్గొని, గతంలో చదువుకున్న విద్యార్థి వ్యవస్థ, వారి గత అనుభవలను ఒకరికి ఒకరు చెప్పుకోవడం జరిగింది.. అలాగే స్నేహ మంటే ఆడుకోవడం కాదు. ఆదుకోవడం, వాడుకోవడం కాదు, వదులుకోక పోవడం అంటు ఒకరికి ఒకరు తన అనుభవాలను చెప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో మనోహరాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# చలో వరంగల్‌కు తరలిన బీఆర్ఎస్ నేతలు



**దౌల్తాబాద్, ఏప్రిల్ 27(ప్రజాస్వరం) :**
చలో వరంగల్ బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలు విజయవంతం చేయడానికి కార్యకర్తలు తండోపతండలుగా తరలి వెళ్లడం జరుగుతుందని బీఆర్ఎస్ దౌల్తాబాద్ రహీముద్దీన్,రాయపోల్ మండల అధ్యక్షులు వెంకటేశ్వర శర్మ అన్నారు. ఆదివారం దౌల్తాబాద్ రాయపోల్ మండల కేంద్రాలలో 25 వ రజతోత్సవం సందర్భంగా బీఆర్ఎస పార్టీ జెండా ఆవిష్కరణ చేసి ఎల్కతుర్తి బయలుదేరే ముందు జెండా ఊపి బయలుదేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరికీ, బీఆర్ఎస్ కుటుంబ సభ్యులకు, తెలంగాణ ఉద్యమకారులకు బీఆర్ఎస్ అభిమానులు అందరికీ బీఆర్ఎస్ 25 వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మండల వ్యాప్తంగా అధిక సంఖ్యలో ఎల్కతుర్తి బహిరంగ సభకు తరలి వెళ్లడం జరుగుతుందన్నారు. బీఆర్ఎస్ పార్టీ అంటే తెలంగాణ బానిస సంకెళ్లను తెంపి మనకు స్వేచ్చా స్వాతంత్రాన్ని సాధించిన పార్టీ అన్నారు. బీఆర్ఎస్ అంటే తెలంగాణ ప్రజలకు ఆత్మగౌరవ ప్రతీక అన్నారు. ఎల్కతుర్తిలో జరిగే బహిరంగ సభ కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు.రాష్ట్రంలో అభివృద్ధి కుంటు పడింది. ఆదాయం మందగించిందన్నారు.కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీలు 420 అబద్ధపు హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చారని, ఆ హామీలు మాత్రం అమలు చేయడం లేదన్నారు. కాంగ్రెస్ హామీలు అమలు చేసేవరకు ప్రజల పక్షాన పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు స్వామి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## సార బట్టీలపై దాడులు నిర్వహించిన ఎక్సైజ్ శాఖ శాఖ అధికారులు



**ఏలూరు జిల్లా,ఏప్రిల్ 27 (ప్రజాస్వరం):** చింతలపూడి ఎక్సైజ్ స్టేషన్ అధికారులు మరియు సిబ్బంది సంయుక్తంగా కలిసి చింతలపూడి మండలం కంచనగూడెం గ్రామము లో నాటు సారాయి స్థావరాలు పై దాడులు నిర్వహించగా శాకా చిన పుల్లారావు కు సంబంధించిన (200) లీటర్ల పులిసిన బెల్లపు ఊట ధ్వంసం చేసి,అతని వద్ద నుండి (10) లీటర్ల నాటు సారాయి,(500) గ్రాములు ఈస్ట్ ,(1) కేజీ ఆలం స్వాధీన పరచుకొని,అతనికి బెల్లం సరఫరా చేయువారు గురించి విచారించగా , చింతలపూడి నగర పంచాయతీ లో కుమార్ ట్రేడర్స్ అను కిరాణా దుకాణము యజమాని అయిన జల్దు పార్థ శేషగిరి రావు అని నిర్ధారించుకొని వెంటనే అచట నుండి బయలు దేరి కిరాణా దుకాణము/గోడౌన్ నకు రాగా మధ్యవర్తుల సమక్షము లో సోదాలు చేయగ (3240) కేజీల బెల్లము , (8) కేజీ ల ఈస్ట్, (5) కేజి ల ఆలం ను స్వాధీన పరచుకొని వారిరువురి పై కేసు నమోదు చేయడమైనది.పట్టుబడిన బెల్లం యొక్క విలువ సుమారు రూ:1,50,000/ ఉంటుందని అంచనా వేయడమైనది.ఈ కేసు లోని నిందితులను ఈ రోజు 27 04 2025 మేజిస్ట్రేట్ వారు ఎదుట హాజరు పరచగా , వారి ఇద్దరిని రిమాండ్ విధించారు.ఈ దాడులలో స్థానిక చింతలపూడి ఎక్సైజ్ ఎస్.ఐ.లు ఆర్.వి.ఎల్.నరసింహా రావు, అబ్దుల్ ఖలీల్ ,మరియు సిబ్బంది పాల్గొన్నారు అని చింతలపూడి సి.ఐ. పి.అశోక్ తెలిపారు.

## రాచపల్లి గుబ్బాలమ్మ తల్లి జాతరలో పాల్గొన్న మురళిరాజు



**ప్రత్తిపాడు,ఏప్రిల్ 27 (ప్రజాస్వరం):**

ప్రత్తిపాడు మండలం రాచపల్లి గ్రామంలో గుబ్బాలమ్మ తల్లి ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు నియోజకవర్గ వైసిపి నేత,ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కృష్ణంరాజు జాతరలో పాల్గొన్నారు. గుబ్బాలమ్మ అమ్మవారిని ఆలయ కమిటీ సభ్యులతో దర్శించుకున్నారు. జాతర నిమిత్తం కమిటీ సభ్యులకు 5000 రూపాయలు విరాళాలు అందజేసారు. గ్రంధ అమావాస్య సందర్భంగా గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు చేయడం చాలా సంతోషదాయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ పెద్దిరెడ్డి నాని,నారిరెడ్డి వీరబాబు,సారిపల్లి గోవింద్,కోలా తాతబాబు, బొల్లు నాగేశ్వరరావు,జువ్వల దొరబాబు,పోకనాటి వెంకటేశ్వరరావు,గుమ్మిడి రామకృష్ణ,కోలా సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## పార్టీలకతీతంగా మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేయాలి

**ఏపీ సాంప్రదాయ మత్స్యకార కులాల సంక్షేమ సంఘాల సమాఖ్య**

**విశాఖపట్నం,ఏప్రిల్ 27(ప్రజాస్వరం):** పార్టీలకతీతంగా సామాజిక వర్గాల అభివృద్ధికి ఏ పార్టీ అధికారంలోనున్న సంపూర్ణ మద్దతు తెలియజేస్తూ తద్వార సామాజిక వర్గాల అభివృద్ధికి తోడ్పాడును అందిపుచ్చుకోవాలని ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ మత్స్యకార కులాల సంక్షేమ సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి చింతకాయల ముత్యాలు అన్నారు. సమాఖ్య ఆధ్వర్యంలో విశాఖ పౌరగ్రంథాలయం సమావేశ మందిరంలో రాష్ట్ర మత్స్యకార ఉపకులాల, ముఖ్యనాయకుల సమావేశము ఆదివారం జరిగింది.ఈ సమావేశానికి రాష్ట్ర నలుమూలల నుండి సంఘం నాయకుల హాజరయ్యారు.సమావేశంలో ముత్యాలు మాట్లాడుతూ మత్స్యకార కులాలకు వ్యతిరేకమైన జి.ఓ.నెం. 217 రద్దుచేసినందుకు, మత్స్యకారసేవలో జీవనభృతిని 20 వేల రూపాయలకు పెంచినందుకు, మత్స్యకారులకు అయిల్ సబ్సిడీ, వేట పరికరాలు తదితర అభివృద్ధి,సంక్షేమ పథకాలను అందిస్తున్నందుకు కూటమి ప్రభుత్వానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ,ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణానికి కృతజ్ఞతలు తెలిపారు. రానున్నకాలంలో కూడా 14 మత్స్యకార ఉపకులాలకు వారి సంక్షేమము అభివృద్ధికి ఇదే తోడ్పాటును అందించాలని ఆశించారు. అదే విధంగా ప్రభుత్వానికి సంఘ సభ్యులు అందరూ బాసటగా నిలవాలని సమావేశంలో తీర్మానం చేశామని తెలిపారు. రాబోవు కాలంలో కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వం ఇచ్చిన ఎమ్.ఎల్.ఎ.. ఎమ్.పి.. ఎమ్.ఎల్.సి. చైర్మన్ల తో సహా రాజకీయ,ఆర్థిక,ఉపాధి, విద్యా రంగాలలో పూర్తి స్థాయిలో కూటమి ప్రభుత్వం సహకారం అందించడానికి, 14 మత్స్యకార ఉపకులాలు ఐక్యతతో ముందుకు సాగి సాధించుకొనే విధంగా సభ తీర్మాణం చేసిందని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు నడకుదిటి ఆర్జున్, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు,గవ్వల గంగాధర్, ఇతర ప్రజాప్రతినిధులతో పాటుగా రాష్ట్ర నలుమూలలనుండి అధిక సంఖ్యలో మత్స్యకార నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కమిటీలను వేయాలని సభలో తీర్మానం జరిగింది.




## ఆదరణ సేవ ఫౌండేషన్ కి నిత్యవసర సరుకులు వితరణ

**ఖమ్మం,ఏప్రిల్ 27(ప్రజాస్వరం):** మధిర పట్టణం సుశీల డిగ్రీ కాలేజ్ రోడ్ లో ఆదరణ సేవా ఫౌండేషన్ కి దొడ్డ శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో రాజుల దేవరపాడు వాస్తవ్యులు దొడ్డ చలపతిరావు నాగమణి వివాహ వార్షికోత్సవం సందర్భంగా వృద్ధులకి మతిస్థిమితం లేని వారికి నిత్యవసర సరుకులు అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఆదరణ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు నిస్సి నిత్యవసర సరుకులు అందజేసిన చలపతి రావు నాగమణి కి ప్రత్యేక ధన్యవాదాలు పెళ్లి రోజు శుభాకాంక్షలు తెలియజేశారు.





## వ్యవసాయ మార్కెట్ లో తడిసిన ధాన్యాన్ని పరిశీలించిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



**చౌటుప్పల్,ఏప్రిల్ 27(ప్రజాస్వరం):**

అకాల వర్షం తో తడిసిన ధాన్యం గురించి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని,ప్రతీ గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ గోపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం అకాల వర్షానికి చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ లో తడిసిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ధాన్యం కొనుగోలు ఎలా జరుగుతున్నాయాని ఎంఆర్ఓ హరికృష్ణ,మార్కెట్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ఎవరు కూడా అధైర్య పడొద్దన్నారు. అన్నదాతలు నష్టపోకుండా అన్ని విధాల ప్రభుత్వం ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేన రెడ్డి,డైరెక్టర్లు గౌస్ ఖాన్,సప్పిడి సంజీవ రెడ్డి,పబ్బు శ్రీకాంత్, రాజి రెడ్డి,మాజీ మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు, రైతులు,నాయకులు పబ్బు రాజు గౌడ్,సూర్వి నరసింహ గౌడ్,బోయ దేవేందర్,బక్క శ్రీనాథ్,రాచకొండ భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.



## యరగర్ల పిచ్చయ్య భౌతిక కాయానికి నివాళులర్పించిన అఖిల భారత యాదవ మహాసభ నాయకులు

**ఖమ్మం,ఏప్రిల్ 27(ప్రజాస్వరం):**

ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు తండ్రి యరగర్ల పిచ్చయ్య శనివారం సాయంత్రం వారి నివాసం వివి పాలెం లో అనారోగ్యంతో చనిపోయారు.అఖిల భారత యాదవ మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షులు మేకల మల్లిబాబు యాదవ్ జిల్లా గౌరవ అధ్యక్షులు చిలకల వెంకట నరసయ్య,జిల్లా యాదవ యువజన అధ్యక్షులు చిత్తారు సింహాద్రి యాదవ్ మరియు యాదవ సంఘం నాయకులు పిచ్చయ్య భౌతిక దేహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించి నివాళులర్పించారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని వారి కుమారులు హనుమంతరావు నాగరాజు, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మనకు జన్మనిచ్చి, తమ జీవితాన్ని ధారపోసి మనలను ఉన్నత స్థితికి చేర్చిన కన్న తండ్రి మరణం తన సంతానానికి ఎంతో వేదన మిగిలిస్తుందని మల్లి బాబు యాదవ్ పిచ్చయ్య మరణం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు .ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ ఫతే మహమ్మద్,తోట రామారావు,వాగదాని కోటేశ్వరరావు,శెట్టి రంగారావు, చేతుల నాగేశ్వరావు, మొరిమేకల కోటయ్య పంకు మురళి,పంకు కిషోర్,పంకు అప్పారావు,పంకు నరసింహారావు,పరిటాల భద్రయ్య,వీరబాబు,పల్లపు భద్రం,లింగయ్య, తదితర యాదవ సంఘం ప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు.

## ధర్మాజీ గూడెం గ్రామంలో అక్షరనందన విద్యాసంస్థల 9వ వార్షికోత్సవం.

**ఏలూరు జిల్లా,లింగపాలెం ఏప్రిల్ 27 (ప్రజాస్వరం):** లింగపాలెం మండలం ధర్మాజీ గూడెం శ్రీ వైష్ణవి అక్షర నందన హైస్కూలు లో వార్షికోత్సవం విద్యార్థినీ విద్యార్థులు డాన్సులతో వేడుకగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ వైష్ణవి విద్యాసంస్థల చైర్మన్ నాని అక్షర నందన ప్రిన్సిపల్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి నాని మాట్లాడారు ఈ సందర్భంగా వైష్ణవి సంస్థల చైర్మన్ నాని మాట్లాడుతూ మొదట్లో బ్యాంకులో ఉద్యోగం చేశానని బ్యాంకు ఉద్యోగం మానేసి విద్యపై దృష్టి పెట్టానని ఇది మా నాన్నగారు యొక్క కృషి పట్టుదలతో విద్యాసంస్థల్లో అడుగు పెట్టానని అన్నారు.మేము కూడా పేద కుటుంబంలో నుంచి వచ్చిన వాళ్ల ము చదువు తోనే మంచిగౌరవం మర్యాద ఉంటుందని విద్యార్థులు చదువుకొని మంచి అలవాటులతో చదివినప్పుడే ఫలితం దక్కుతుందని అన్నారు.గడిచిన 4 5 ఏళ్ల క్రితం విద్యాసంస్థల్లో అనుభవం లేక కొంతవరకు ఆర్థిక నష్టం కలిగింది అయితే మా తండ్రిగారు డబ్బు కోల్పోతే కోల్పోయాం అనుభవం వచ్చిందని ఇప్పుడైనా శ్రద్ధతో శ్రీ వైష్ణవి విద్యాసంస్థలు ప్రారంభించామని నూజివీడు విజయవాడ గుంటూరు నగరాల్లో వైష్ణవి విద్యాసంస్థల్లో ఫస్ట్ ర్యాంకులు సాధించామని భవిష్యత్తులో కళాశాల నుంచే రూపుదిద్దుకుంటుందని అన్నారు అలాగే నూజివీడులో ధర్మాజీ గూడెంలో ప్రారంభిస్తున్న వైష్ణవి విద్యాసంస్థలు ఒకటోవా తరగతి నుంచి ఏసీ కదులు ప్రారంభించు తున్నామని అన్నారు కార్పొరేట్ విద్యాసంస్థల దీటుగా శ్రీ వైష్ణవి విద్యాసంస్థలు ఉన్నాయని నూజివీడు ధర్మాజీగూడెం గ్రామాల్లో కూడా వచ్చే సంవత్సరం 2025 2026 సంవత్సరానికి శ్రీ వైష్ణవి కళాశాల ప్రారంభించడం జరుగుతుందని ఆయన తెలిపారుఅక్షర నందన ప్రిన్సిపల్. కే. శివరాఘవ రాజు(పండు) మాట్లాడుతూ. ప్రతి మనిషి జీవితంలో విద్యార్థి దశ ప్రాముఖ్యమైనదని విద్యార్థి ఎదుగుదలను నిర్ణయిస్తుందని తెలిపారు. కావున విద్యార్థులు క్రమశిక్షణతో లక్ష్యాన్ని నిర్దేశించుకుని ప్రణాళిక ప్రకారం ముందు సాగాలని తెలిపారు తల్లిదండ్రులు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకునేలా ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు .ఈ కార్యక్రమంలో కస్పాండెంట్ వరలక్ష్మి,వైష్ణవి విద్యాసంస్థలుఏవో డాక్టర్ వి ప్రతాప్.శ్రీ వైష్ణవి అక్షరానందన ఉపాధ్యాయులు సిబ్బంది విద్యార్థుల తల్లి తండ్రులు తదితరులు పాల్గొన్నారు.



## గురుకుల ఉపాధ్యాయుల సామర్ధ్య పెంపొందింపు శిక్షణా కార్యక్రమం

**ఏలూరు జిల్లా,ఏప్రిల్ 27 (ప్రజాస్వరం):** వట్లూరులో ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ మరియు అజీమ్ ప్రేమ్ జీ యూనివర్సిటీ (బెంగళూరు) వారు సంయుక్తంగా నిర్వహిస్తున్న కెపాసిటీ బిల్డింగ్ శిక్షణ కార్యక్రమం నేటితో ముగిసింది.ఈనెల 24 నుండి 26 వరకు మూడు రోజుల పాటు గణిత ఉపాధ్యాయులకు జరిగిన ఈ శిక్షణా కార్యక్రమం ముగింపు సభలో డిప్యూటీ ఎ.ఎం.ఓ . శాంతి విశాల,అజీమ్ ప్రేమ్ జీ యూనివర్సిటీ రిసోర్స్ పర్సన్ రేష్మ కృష్ణన్,పణి తేజ,ఏలూరు జిల్లా డి.సి.ఓ ఉమా కుమారి, వట్లూరు సాంఘిక సంక్షేమ కళాశాల ప్రిన్సిపాల్ దాసరి మేరీ ఝాన్సీ రాణి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.





## గ్రూప్ 1,5 ఉద్యోగాల విజేత జ్యోతి శిరీషకు సత్కారం

**తలసిమియా,సిక్కిల్ సెల్ పూర్తి చికిత్స నిర్వహణ బాధ్యత నాదే:డాక్టర్ కూరపాటి ప్రదీప్**

**ఖమ్మం,ఏప్రిల్ 27(ప్రజాస్వరం):** యాభైసార్లు రక్తం ఎక్కించుకుని ఒకవైపు తన వ్యాధిని నయం చేసుకుంటూనే మరోవైపు సర్కారీ కొలువు కొట్టాలని సంకల్పంతో భీష్మంచుకొని తన లక్ష్యాన్ని నెరవేర్చుకున్న ఖమ్మం జిల్లా యువతి జ్యోతి శిరీష అందరికీ ఆదర్శప్రాయురాలని ప్రముఖ చిన్న పిల్ల వైద్యులు డాక్టర్ కూరపాటి ప్రదీప్ కుమార్ అన్నారు.రక్తహీనతలు బాధపడుతూ ఒకవైపు తన ప్రాణాలకే గ్యారెంటీ లేని తరుణంలో మొక్కవోని దీక్షతో సర్కారీ కొలువు కొట్టాలని లక్ష్యంతో రేయింబవళ్ళు పుస్తకాలతో కుస్తీ పట్టి గ్రూప్ వన్ లో ర్యాంకును సాధించి ఏకంగా 5 సర్కారు కొలువులను కొట్టిన జ్యోతి శిరీష ఖమ్మం జిల్లా యువతి కావడం మన ఖమ్మం జిల్లాకే గర్వకారణమని ఆయన అన్నారు.నిరుపేద కుటుంబంలో జన్మించి బాల్యదశ నుంచి సికిల్ సెల్ రక్తహీనతతో కూడిన వ్యాధితో బాధపడుతూ 50 సార్లు రక్తం ఎక్కించుకొని తన ప్రాణాలను వైద్యుల చేత కాపాడబడుతూ నేడు 5 సర్కారీ కొలువులను కొట్టిన విజేతగా నిలిచిన జ్యోతి శిరీష యువతకు ఆదర్శప్రాయురాలని ఆయన అన్నారు.ఇక నుంచి జ్యోతి శిరీష వైద్య చికిత్స అంశంలో తను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని పూర్తి వైద్య ఖర్చులతో పాటు మందులను కూడా ఉచితంగా అందిస్తానని ఆయన అన్నారు. అనంతరం సన్మాన గ్రహీత జ్యోతి శిరీష మాట్లాడుతూ అత్యంత ప్రమాదకరమైన సికిల్ సెల్ వ్యాధితో తాను బాధపడుతూ అనేక సందర్భాలలో తాను ఈసమాజాన్ని చూస్తానో లేదో అని భయాందోళనలతో.. మరోవైపు ప్రభుత్వ కొలువులను కొట్టాలనే అకుంఠిత దీక్షతో తాను గ్రూప్ 1 లో ర్యాంకును సాధించి, ఐదు ప్రభుత్వ ఉద్యోగాలను పొందడం తనకు ఎంతో సంతృప్తిని ఇచ్చిందని ఆమె అన్నారు.తలసేమియా మరియు సికిల్ సెల్ అనీమియతో బాధపడుతున్న అనేకమంది చిన్నారులకు ప్రాణాలు నిలుపుతున్న డాక్టర్ కూరపాటి ప్రదీప్ వైద్య సేవలు మాటల్లో వర్ణించలేనివని ఈ సత్కారం తనకెంతో బాధ్యతను పెంచిందని ఆమె అభివర్ణించారు.తనది ఖమ్మం జిల్లాలోని మిట్టపల్లి గ్రామం. అని,తన తండ్రి సుతారీ మేస్త్రి,అమ్మ శారదమ్మ వ్యవసాయ కూలీ అని,చెల్లి స్పందన డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగాన్వేషణలో ఉందని, చిన్ననాటి నుంచి నాకు చదువు కోవడమంటే చాలా ఇష్టం అని,ప్రైవేటు స్కూళ్లలో చదివే స్థోమత లేక గురుకుల పాఠశాలల్లో చదువుకున్నానని,ఆపై డిగ్రీ సార్వత్రిక విద్య ద్వారా అభ్య సించానని,ఉస్మానియా లో పీజీ చేసిన తర్వాత టీటీసీ,బీఈడీ చేసి సివిల్స్, ఇతర పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యానని , వరుసగా విద్యార్హతలు పెంచుకుంటూ పోయానని అనిపిస్తున్నా కూడా నా విద్యాజీవితం అంత సులువుగా ఏమీ సాగలేదని, తాను సికిల్ సెల్ ఎనీమియా (తీవ్ర రక్తహీనత) బాధితురాలిని అని,ఆరో తరగతిలో తనకీ సమస్య ఉందని వైద్యులు నిర్ధారించారన్నారు.తరచూ రక్తం తగ్గిపోయి కాళ్లు,చేతులు వాపు వచ్చేవని,దానికితోడు తలనొప్పి,ఎముకల మధ్య సూదులతో గుచ్చినట్టు బాధ. ఇవన్నీ పంటి బిగువన భరిస్తూనే చదివానని. ఎన్నోసార్లు ఆసుపత్రులకు వెళ్లాల్సి వచ్చిందని. ఇప్పటివరకూ దాదాపు యాభైసార్లు రక్తం ఎక్కించారంటే నా పరిస్థితి అర్థం చేసు కోవచ్చునని ఆమె అన్నారు. తమది రెక్కాడితేకానీ డొక్కాడని కుటుంబం అని నా అనారోగ్యం నాకు .నా స్నేహితులు,బంధువుల నుంచి అవమానాలను తెచ్చి పెట్టాయని,అయినా కూడా అమ్మానాన్నలు నన్ను ప్రోత్సహించేవారు అని చెప్పారు.కూలి పనులు చేస్తూ నా వెన్నంటే నిలిచారని, చదువయ్యాక శిక్షణ తీసుకుంటూ సివిల్స్ ఇతర పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయి..విజేతగా నిలవాలని కసితో చదివానని. ఈ క్రమంలో ఓ స్నేహితుడు, మేనమామల సాయాన్ని మర్చి పోలేను అని చెప్పారు..నిజానికి గతేడాది గ్రూపు 4 ఉద్యోగానికి ఎంపికయ్యానని, అదే సమయంలో గురుకుల టీచర్ (టీజీటీ) ఫలితాల్లో ర్యాంకు రావటంతో దాన్ని కాదనుకుని దానవాయి గూడెం బీసీ గురుకులంలో ఉపాధ్యాయినిగా చేరాను అని, మూడు నెలల తర్వాత, గత అక్టోబరులో డిఎస్సీ ఫలితాలు వెలువడటంతో సోషల్ స్టడీస్ స్కూల్ అసిస్టెంట్ ని అయ్యాను అని అన్నారు... ప్రస్తుతం వైరా ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో పనిచేస్తున్నానని. ఈ ఏడాది మార్చిలో ఐసీడీఎస్ ఎక్స్ టెన్షన్ ఆఫీసర్ ఉద్యోగానికి ఎంపికయ్యాను అని, తాజాగా గ్రూపు 1 ఫలితాల్లో 450.5 మార్కులతో రాష్ట్రస్థాయిలో 604వ ర్యాంకు సాధించానుఅని, ఎస్సీ జనరల్ విభాగంలో రాష్ట్రస్థాయిలో 25వ ర్యాంకు, ఎస్సీ మహిళల కోటాలో ఏడో ర్యాంకు దక్కించుకోవటం ఆనందంగా ఉందని అన్నారు. అలాగని దీనితో ఆగిపోనని, సివిల్స్ సాధించడమే లక్ష్యం అని, ప్రస్తుతం వైద్యుల సూచనలతో నా ఆరోగ్యం కూడా కుదురుకుంది అని చెప్పారు. నా విజయం కొంత మంది ఆలోచనలనైనా మార్చాలని, వారిలో మార్పునకు కారణ మవ్వాలన్నదే నా ఆశ అని ఆమె అన్నారు.ఈ సన్మాన కార్యక్రమంలో మోతిలాల్, నసీర్,సిరాజ్,వంశీ పాల్గొన్నారు.



## పిలా శ్రీనివాసరావుకి మేయర్ అభ్యర్థి గా బి ఫాం అందజేస్తున్న జిల్లా టిడిపి అధ్యక్షులు గండి బాబ్జి

**విశాఖ అభివృద్ధి కోసమే మేయర్ ని మారుస్తున్నాం గండి బాబ్జి**

**విశాఖపట్నం,ఏప్రిల్ 27(ప్రజాస్వరం):** మేయర్ మార్పు విశాఖ కోసమే జరుగుతుంది అని రాష్ట్ర కోఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గండి బాబ్జి అన్నారు. ఆదివారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పీలా శ్రీనివాసరావు కి బీఫాం బాబ్జి అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అధోగతి పాలైతే నాలుగేళ్లు జీవీఎంసీ వైసిపి పాలనలో విశాఖ అభివృద్ధి కుంటు పడిపోయిందని అన్నారు. కూటమి పాలనలో విశాఖను అభివృద్ధి అభివృద్ధి చేయాలనే దృక్పథంతో కూటమి నాయకులు మేయర్ ను మార్చాలని నిర్ణయించారని చెప్పారు.రాష్ట్రంలో కూటమి పాలనతో రాష్ట్రం అభివృద్ధి జరుగుతున్నది.ఇప్పుడు మేయర్ మార్పుతో విశాఖపట్నం మరింత అభివృద్ధి చెందుతుందని బాబ్జి ఆశాభావం వ్యక్తం చేశారు.



# వరంగల్ రజతోత్సవ సభకు బయలుదేరీనా మొయినాబాద్ బిఆర్ఎస్ నేతలు

**రాష్ట్రనికి శ్రీరామ రక్ష గులాబీ జెండా:పెండ్యాల శ్రీనివాస్ బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు**

**మొయినాబాద్,ఏప్రిల్ 27 (ప్రజాస్వరం):**మండలంలోని యేన్కేపల్లి గ్రామంలో వరంగల్ రజతోత్సవ సభకు బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు బారీగా కదిలారు. గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ జెండా ఆవిష్కరించిన యేన్కేపల్లి బిఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు పెండ్యాల శ్రీనివాస్,ఇంచార్జ్జి కుమ్మరి రాము మాజీ సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆధ్వర్యంలో ఘనంగా భారత రాష్ట్రసమితి 25వ ఆవిర్భావ దినోత్సవం వేడుక జరిగింది. అనంతరం కుమ్మరి రాము మాట్లాడుతూ కేసీఆర్ పాలనలో ప్రజలు సుభిక్షంగా ఉండే కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రన్నీ చిన్న బిన్నం చేసింది. తెలంగాణ రాష్ట్ర సాధనకు తన ప్రాణం కూడా లెక్క చేయకుండా మనకు స్వరాష్ట్రం సాధించి పెట్టారు. అలాంటి మహా నేత కేసీఆర్ అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో నాయకులు పెండ్యాల శ్రీనివాస్,కుమ్మరి రాము,కుమ్మరి శ్రీనివాస్, ఇదులకంటి రవి,నడికుడ విగ్నేష్,కావాలి ప్రేమ్, ముదిగొండ సురేష్ యాదవ్, చేవెళ్ల రాజేందర్,కటికె జాంగిర్, ఎలాగనీ రమేష్ గౌడ్,బత్తుల రాజేష్ గౌడ్,ప్రవీణ్ రెడ్డి,దప్పు కరంచంద్,న్యాలటీ విగ్నేష్, ముహమ్మద్ యూసుఫ్, పెండ్యాల మధు,న్యాలటీ శోభన్,కావాలి నరేష్, పెండ్యాల మహేష్,పెండ్యాల గోపాల్,ఎలాగని నర్సింహరాజ్ గౌడ్,అమ్దాపూర్ సునిల్, యెంగని మధు,చేవెళ్ల సునీల్,శాన్ పాషా,దప్పు ప్రేమిల తదితరులు పాల్గొన్నారు.





# అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన రఘును ఘనంగా సన్మానించిన ప్రముఖులు







**జమ్మికుంట,ఏప్రిల్ 27 (ప్రజాస్వరం):**

ఇటీవల హిమాచల్ ప్రదేశ్ లోని ధర్మశాలలో జరిగిన జాతీయ మాస్టర్స్ గేమ్స్,అథ్లెటిక్స్ పోటీలను హైమర్ త్రో 35+ విభాగంలో అత్యంత ప్రతిభను కనబరిచి కాంస్య పథకాన్ని గెలుపొందగా హుజురాబాద్ మండలం చెల్పూర్ గ్రామస్తులు శనివారం సాయంత్రం గ్రామపంచాయతీ ఆవరణంలో అభినందన సభను ఏర్పాటు చేశారు.అట్టి కార్యక్రమానికి గా మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, పాల్గొని రఘుని శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రఘు నిరుపేద కుటుంబంలో పుట్టి, ఉన్నత చదువులు అభ్యసించి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఎంపికై జీవనం కొనసాగిస్తున్న తరుణంలో ఇటీవల మాస్టర్ గేమ్స్ అథ్లెటిక్స్ పోటీలలో జాతీయస్థాయిలో అత్యంత ప్రతిభను కనబరిచి పథకం సాధించడం చెల్పూర్ గ్రామానికి కాకుండా ఈ రాష్ట్రానికి గర్వకారణమని కొనియాడారు. సింగపూర్ లో జరిగే అంతర్జాతీయ పోటీలలో పాల్గొని పథకాలు సాధించాలని కోరారునేటి సమాజంలో యువకులందరూ ముందుకు మత్తు పానీయాలకు డ్రగ్స్ కు గంజాయికి అలవాటు పడుతున్న తరుణంలో రఘు క్రీడల్లో పథకాలు సాధించడం గర్వకారణమని తెలుపుతూ వారిని ఆదర్శంగా తీసుకోవాలని యువకులకు పిలుపునిచ్చాడు.యువకులు వారి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోకుండా తల్లిదండ్రుల కలలు కన్నా కళలను సహకారం చేయాలని కోరారు .ఈ కార్యక్రమంలో జయ భారతి విద్యాసంస్థల చైర్మన్ ప్రతాపరెడ్డి, అంతర్జాతీయ క్రీడాకారులు అంబాల ప్రభాకర్ ప్రభు, వంతడుపుల బాబు, జైపాల్ రెడ్డి, వేల్పుల రత్నం,జకర్యా, సాయిబాబా,పంజాల కృష్ణమూర్తి, కోడిగుటిప్రవీణ్,సదానందం,సమ్మెట సంపత్,మొలంగూరి ప్రభాకర్,దయాకర్,గన్ను అశోక్, త్రామ్ రాజలింగం ,రాజేశ్వర్,శనిగరం రవి,ఆకునూరి రవీందర్, వంతడుపుల రమేష్,నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఐకేపీ, సింగిల్ విండో కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి:సిపిఎం

**వలిగొండ,ఏప్రిల్ 27(ప్రజాస్వరం):**ఆదివారం కురిసిన అకాల వర్షం కారణంగా మండలంలో ఐకెపి, సింగిల్ విండో కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని ఎలాంటి ఆంక్షలు లేకుండా ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా కురిసిన అకాల వర్షం కారణంగా మండల పరిధిలోని అనేక గ్రామాల్లో ఐకెపి,సింగిల్ విండో కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యం తడిసి ముద్దయిందని, దీనివల్ల రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని,ప్రభుత్వం వెంటనే ఎలాంటి ఆంక్షలు పెట్టకుండా తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.అదేవిదంగా కొనుగోలు కేంద్రాల్లో సరిపడ టార్పిన్ కవర్లు అందుబాటులో ఉంచి భవిష్యత్తులోనైనా దాన్యం తడవకుండా ధాన్యానికి రక్షణ కల్పించాలని, ధాన్యం కొనుగోలను వేగవంతం చేయాలని,లారీల కొరత లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని,రైస్ మిల్లర్ల మధ్యన ప్రభుత్వం మధ్యన ఎలాంటి సమస్యలు లేకుండా అధికారుల పర్యవేక్షణ ఉండాలని, కొనుగోలు చేసిన ధాన్యానికి వెంటనే బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు.





# రమణ కుటుంబానికి షబ్బీర్ అలీ చేయూత

**నిజామాబాద్,ఏప్రిల్ 27(ప్రజాస్వరం):**ఇటీవల ఆనారోగ్యంతో మృతి చెందిన హిందూ పత్రిక ఫోటోగ్రాఫర్ రమణకు ప్రభుత్వ సలహాదారు,నిజామాబాద్ అర్బన్ ఇంచార్జీ షబ్బీర్ అలీ రూ"25 వేల ఆర్థిక సహాయం అందించారు.ఇట్టి నగదును రమణ సతీమణి కి ఆదివారం అందించడం జరిగింది. హిందూ పత్రిక రెసిడెన్సీ ఎడిటర్ రవి రెడ్డి సూచన మేరకు షబ్బీర్ అలీ ఆర్థిక సహకారం అందించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రతినిధులు షబ్బీర్ అలీ కి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజె ఐజెయూ జిల్లా అధ్యక్షులు ఎడ్ల సంజీవ్, యూనియన్ ప్రతినిధులు అహ్మద్ అలీఖాన్, ధనుంజయ్,గోవిందరాజు, రతన్లు తదితరులు పాల్గొన్నారు.

# చల్లూరు వార సంతలో చలివేంద్రం ప్రారంభించిన అమ్మ ఫౌండేషన్

**జమ్మికుంట,ఏప్రిల్ 27 (ప్రజాస్వరం):**

కరీంనగర్ జిల్లా, వీణవంక మండల పరిధిలోని చల్లూరు గ్రామంలో ప్రతి ఆదివారం రైతు వేదిక వద్ద జరుగుతున్న వారసంతలో సంతకు వచ్చే ప్రజల సౌకర్యార్థం వేసవికాలం దృష్టిలో ఉంచుకొని అమ్మ ఫౌండేషన్ మల్లారెడ్డిపల్లి వారి ఆధ్వర్యంలో విజయ వాటర్ ప్లాంట్ చల్లూరు వారి సౌజన్యంతో చలివేంద్రం ప్రారంభించారు.ఈ సందర్భంగా అమ్మ ఫౌండేషన్ మల్లారెడ్డిపల్లి వ్యవస్థాపక అధ్యక్షులు గోనెల సమ్మన్న ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి ముద్దసాని శ్రీనివాసులు మాట్లాడుతూ వేసవికాలం ఎండలు తీవ్రంగా ఉన్నందున ఆదివారం అంగడికి వచ్చే ప్రజల సౌకర్యార్థం వారి దాహార్తిని తీర్చేందుకు ఈ చలివేంద్రం ప్రారంభించినామని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరుతు విజయ వాటర్ ప్లాంట్ చల్లూరు వారికి మరియు మాకు సహకరిస్తున్న దాతలందరికీ ధన్యవాదాలు తెలియజేశారు .ఈ కార్యక్రమంలో సభ్యులు ఎలువాక నరేష్, గోమాత ప్లెక్సీ ప్రింటర్ సాయి,విజయ వాటర్ ప్లాంట్ నల్లగొని మొగిలి గౌడు, సదానందం గౌడ్,గాజుల హరిత,కడమంచి దివ్య తదితరులు పాల్గొన్నారు.




# దేవస్థానం భూములలో అక్రమ నిర్మాణాలు.

**చోద్యం చూస్తున్న అధికారులు.**

**విశాఖపట్నం,ఏప్రిల్ 27(ప్రజాస్వరం):**స్థానిక 90 వార్డు లక్ష్మీ నగర్ కొండవాలు ప్రాంతంలో సర్వే నెంబర్ 1/1 లో ఖాళీ స్థలం ఆక్రమించి నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు సాగుతున్నాయి. దేవస్థానం భూపరిరక్షణ అధికారులు ఆదేశాలతో ఇక్కడ నిర్మాణాలు జరుగుతున్నాయని,అలాగే సొమ్ములు తీసుకుని నిర్మాణాలకు ప్రోత్సహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇక్కడ చేసే గార్డ్ కూడా ఈ అక్రమ నిర్మాణం విషయంలో చూసి చూడనట్టు వ్యవహరించడం విశేషం. గార్డ్ ఉద్యోగమే కాకుండా దేవస్థానంలో ఉన్న ఏఈకి డ్రైవర్ సేవలు చేస్తున్నారని విమర్శలు ఉన్నాయి.ఇలా దేవుడు భూములు అన్యాక్రాంతం అవ్వడానికి దేవస్థానం అధికారులే కారణమని ఈ నిర్మాణం చూస్తే అర్థమవుతుంది.దేవుడు వద్ద ఉద్యోగం చేస్తూ జీతం తీసుకుని దేవుడికే ద్రోహం చేస్తున్నారంటే ఇలాంటి అధికారులు ఏమనాలి అని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అధికారులకు తెలిసే ఏ నిర్మాణాలు జరుగుతున్నాయని స్థానిక ప్రజల ఆరోపణలు చేస్తున్నారు.ఈ నిర్మాణాలపై అధికారులు దృష్టి పెట్టి దేవుడి భూములు అంజాక్రాంతం కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. లేనిపక్షంలో దేవస్థానం భూములు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని వారంతా హెచ్చరిస్తున్నారు.



# జన విజ్ఞాన వేదిక వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం

**నర్సంపేట,ఏప్రిల్ 27 (ప్రజాస్వరం):**జన విజ్ఞాన వేదిక వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో ఆదివారం ఉచితంగా మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు మోతె ఇంద్రసేనారెడ్డి అధ్యక్షత వహిస్తూ రిబ్బన్ కట్ చేసి, సహజపానీయాలతో మనం ఆరోగ్యంగా ఉంటామని, మజ్జిగ,కొబ్బరి నీళ్లు, షర్బత్,రాగి మాల్టు లాంటి సహజపానియాలు తాగాలని,అనారోగ్యం పాలు చేసే కూల్ డ్రింక్స్ ను మానివేయమని జనవిజ్ఞాన వేదిక విజ్ఞప్తి చేస్తుందన్నారు. జన విజ్ఞాన వేదిక గౌరవ అధ్యక్షులు,నేటి ఉచిత మజ్జిగ పంపిణీ కరపత్రాల ప్రచురణకర్త డాక్టర్ వి ఎం జయుడు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ ప్రపంచం మొత్తంలో ఒక సంవత్సరానికి రెండు కోట్ల టన్నుల రసాయనాలను కూల్ డ్రింక్స్ రూపంలో ప్రజలు తాగుతున్నారు ప్రతి లీటరు కూల్డ్రింకులో 0.0180 మి. గ్రా. క్రిమిసంహారక మందులు ఉన్నాయని మనదేశంలోని సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్మెంట్ అనే సంస్థ బయటపెట్టింది.సి.ఎస్. ఈ నిర్ధారణ ప్రకారం ఇలాంటి క్రిమిసంహారక మందుల మోతాదు 0.0005 మి. గ్రా. మించకూడదు. కానీ అది 36 రెట్లు ఎక్కువగా ఉన్నాయి. అందుకే ప్రాణాంతకమైన కూల్ డ్రింక్స్ ని తాగకూడదన్నారు. జన విజ్ఞాన వేదిక జనరల్ సెక్రటరీ సుధాకర్ కూల్ డ్రింక్స్ తాగడం వల్ల నష్టాలను వివరిస్తూ..ఈ శీతల పానీయాలలో ఫ్రక్టోస్ వల్ల అధిక రక్తపోటు,మధుమేహం వచ్చే అవకాశం ఉందని, ఈ శీతల పానీయాలలో పాస్పారిక్ ఆమ్లం వాడడం వల్ల అస్టియో ఫ్లోరోసిస్,లివర్ ఫ్లోరోసిస్ వచ్చే అవకాశం ఉందని,వీటిలో కలిపే సోడియం బెంజాయిట్ అనే ప్రెజర్వేటివ్ రసాయనం కణాల్లోని డి.ఎన్.ఏ పై ప్రభావం చూపడమే కాకుండా కణ వ్యవస్థను నష్టం కలిగిస్తుందన్నారు.ఈ కూల్డ్రింక్స్ తాగడం వల్ల కిడ్నీలలో రాళ్లు ఏర్పడతాయి. వీటిలో ఆసిడ్ వల్ల కడుపులో ఎసిడిటీ మరియు జీర్ణ వ్యవస్థలో సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. చెకుముకి కన్వీనర్ ఎం.డి రాయబోస్ మాట్లాడుతూ కేరళలోని ప్లాచి మాడ రాజస్థాన్లోని కాలాడేరా ప్రాంతాల్లోనూ కోకా కోల తయారీ కర్మాగారాల వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోయి వ్యవసాయం తీవ్రంగా దెబ్బతింది.వ్యర్థ పదార్థాల విసర్జన వల్ల ఆ ప్రాంత ప్రజలు తీవ్ర అనారోగ్యం పాలయ్యారు అన్నారు. గౌరవ అధ్యక్షులుగా పెండం భాస్కర్ మాట్లాడుతూ ఆరోగ్యపరంగా, ఆర్థికంగా,సామాజికంగా ఎంతో నష్టాన్ని కలిగించే కూల్డ్రింక్స్ మాయలో పడకండి అని మజ్జిగ పంపిణీ కార్యక్రమంలో హాజరైన ప్రజలనుదేశించి అన్నారు.ఉపాధ్యక్షుడు సాగర్ మాట్లాడుతూ సహజపానియాలతోనే దాహాన్ని తీర్చుకుందాం కూల్ డ్రింక్స్ పై మోహాన్ని వదులుకుందాము అన్నారు. నర్సంపేట మండల ప్రధాన కార్యదర్శి నవీన్ తక్కువ ఖర్చుతో ఆరోగ్యాన్ని పెంపొందించుకుందామని, ఎక్కువ ఖర్చుతో కూడుకొని అనారోగ్యం పాలు చేసే కూల్డ్రింక్స్ ని మానేద్దాం అన్నారు. ఇకముందు ఇటువంటి సేవా కార్యక్రమాలు చేయడానికి ఎవరైనా మనసున్న,దాతృత్వం కలిగిన వారు ముందుకొచ్చి జనవిజ్ఞాన వేదికకు తోడ్పాటును అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో లీడ్ లైబ్రరీ వ్యవస్థాపకులు రవి కుమార్,ఫిజియోథెరపీ డాక్టర్ భరత్,సారంగపాణి, సాంబయ్య,హెడ్ కానిస్టేబుల్ అంగోత్ వీరన్న కిరణ్,జన విజ్ఞాన వేదిక వరంగల్ జిల్లా సంస్కృతిక కన్వీనర్ సిహెచ్ యాకయ్య,జే వీ వీ గూడూరు మండల బాధ్యులు సోమ రవి,జగన్ రెడ్డి,కావేరి,జే వీ వీ జిల్లా కార్యదర్శి డి.కిరియా ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.




# నర్సంపేట నుండి భారీగా బయలుదేరిన గులాబీ శ్రేణులు

- రజతోత్సవాన్ని పురస్కరించుకొని జండా ఆవిష్కరణ
- అమరులకు ఘనంగా నివాళులు అర్పించిన బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాయుడు రవీందర్ రెడ్డి
- జిల్లా నాయకులు నల్ల మనోహర్ రెడ్డి
- పట్టణ అధ్యక్షుడు నాగేల్లి వెంకట్ నారాయణ

**నర్సంపేట,ఏప్రిల్ 27 (ప్రజాస్వరం):**బిఆర్ఎస్ 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వరంగల్ జిల్లా ఎలకతుర్తి లో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు వెళ్లే ముందు అమరవీరుల కు ఘనంగా నివాళులర్పించి పార్టీ పట్టణ అధ్యక్షుడు నాగలి వెంకట్ నారాయణ పార్టీ జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది. కార్యక్రమంలో బి ఆర్ టి యు జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు పట్టణ కార్యదర్శి వెన్న ముద్దల శ్రీధర్ రెడ్డి పట్టణ యువజన అధ్యక్షుడు రాయిడి దుశాంత్ రెడ్డి మాజీ కౌన్సిలర్లు మండల శ్రీనివాస్ నాగిశెట్టి ప్రసాద్ శివరాత్రి స్వామి పుల్లూరు స్వామి పిండం వెంకటేశ్వర్లు దేవోజు సదానందం వార్డు అధ్యక్షుడు సాలయ్య బీరం నాగిరెడ్డి బాబు నాయిని వేణు పైసా ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



# నూతన ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం కి ఘన సన్మానం

**టిపిసిసి నాయకులు బట్టు జగన్ యాదవ్**

మునుగోడు,ఏప్రిల్ 27(ప్రజాస్వరం):శాసనసభ ఎమ్మెల్యే కోటాలో నూతన ఎమ్మెల్సీగా నియమితులైన నెల్లికంటి సత్యం ఆత్మీయ అభినందన సభ మునుగోడు లో పాల్గొని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం గారిని పుష్పగుచ్చం ఇచ్చి శాలువాతో సన్మానించడం జరిగింది.ఈ సందర్భంగా టీపీసీసీ నాయకులు బట్టు జగన్ యాదవ్ మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తులో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు సీపీఐ జిల్లా కార్యదర్శి సత్యం ని ఎమ్మెల్సీగా నియమించడం హర్షించదగ్గ విషయమని, సత్యం విద్యార్థి దశ నుండి కమ్యూనిస్ట్ భావజాలంతో ఏ పదవి ఆశించకుండా కష్టపడ్డా సత్యం నీ కమ్యూనిస్ట్ పార్టీ అధిష్టానం గుర్తించడం గొప్ప పరిణామం అన్నారు.యే పార్టీ అయిన పార్టీ కోసం పని చేసిన కార్యకర్తను గుర్తిస్తుంది అనడానికి సత్యం ఎన్నికే నిదర్శనం అన్నారు.ఈ కార్యక్రమంలో నాంపల్లి యాదవ సంఘం అధ్యక్షుడు అప్పనబోయిన ఏడుకొండల యాదవ్,సైదులు,పంగ కొండయ్య,వస్త్య రమేశ్ నాయక్,కమ్యూనిస్టు నాయకులు కొన్రెడ్డి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



# కూలర్ షాక్ తగిలి చిన్నారి మృతి

**నిజామాబాద్,ఏప్రిల్ 27(ప్రజాస్వరం):**విద్యుత్ షాక్ తో చిన్నారి మృతిచెందిన విషాద ఘటన నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం చిక్లి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది.గ్రామస్తుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గడ్డం నవీన్‌రచన కుమార్తె వేదాన్షి (6)సంవత్సరాలు ఇంటి బయట ఉన్న ఇనుప కూలర్ ను ముట్టుకోవడంతో షాక్ తగిలి పడిపోయింది.కుటుంబ సభ్యులు గమనించి ఆసుపత్రికి తరలించగా మృతి చెందిందని వైద్యులు ధ్రువీకరించారు.చిన్నారి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుము కున్నాయి.



# ఆ సమయంలోనే జీవిత పాఠం నేర్చుకున్నా

కమల్ హాసన్ కుమార్తెగా ఇండస్ట్రీకి పరిచయమై తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు నటి శ్రుతి హాసన్. సినీ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చినప్పటికీ తాను ఎప్పుడూ దాన్ని దృష్టిలో పెట్టుకోలేదని తాజాగా వెల్లడించారు. ఇండస్ట్రీకి రావడానికి ముందు ఎన్నో విషయాలు తెలుసుకున్నట్లు తెలిపారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న శ్రుతి తన చిన్ననాటి విషయాలు పంచుకున్నారు. “తన తల్లిదండ్రులు విడాకులు తీసుకున్న సమయంలోనే తాను జీవిత పాఠం నేర్చుకున్నట్లు చెప్పారు. “నేను ఇండస్ట్రీకి రావడానికి ముందు నా జీవితంలో ఏం జరిగిందో చాలామందికి తెలియదు. నా తల్లిదండ్రులు విడిపోవడం నన్ను ఎంతో బాధించింది. వారిద్దరూ విడిపోయాక నేను అమ్మతో ఉన్నాను. అప్పటివరకు ఉన్న జీవితం ఒక్కసారిగా మారిపోయింది. చెన్నై నుంచి ముంబయి వచ్చేశాం. విలాసవంతమైన జీవితం దూరమైంది. అప్పటివరకూ మెర్సిడెస్ బెంజ్ కారులో తిరిగిన నేను లోకల్ ట్రైన్లో ప్రయాణించాను. రెండు రకాల జీవితాలు చూశాను. ఇండస్ట్రీకి వచ్చాక నాన్నతో ఎక్కువగా ఉంటున్నాను. విదేశాల్లో సంగీతం నేర్చుకున్నాను. నాకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాను. స్వతంత్రంగా, ఆత్మవిశ్వాసంతో జీవిస్తున్నాను” అని చెప్పారు.




# ‘వృష కర్మ’గా నాగ చైతన్య..!

ఇటీవల తండేల్ సినిమాతో సూపర్‌హిట్‌ను అందుకున్న యువ సామ్రాట్ అక్కినేని నాగచైతన్య మరో కొత్త ప్రాజెక్ట్‌ను మొదలుపెట్టాడు. సాయి ధరమ్ తేజ్‌కి ‘విరుపాక్ష’ లాంటి బ్లాక్ బస్టర్‌ను అందించిన దర్శకుడు కార్తీక్ వర్మ దండు దర్శకత్వంలో చైతూ ఒక సినిమా చేయబోతున్న విషయం తెలిసిందే. ఎన్‌సీ24 అనే వర్కింగ్ టైటిల్‌తో వస్తున్న ఈ చిత్రం సూపర్ న్యాచురల్ థ్రిల్లర్‌గా రాబోతుంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ మూవీ త్వరలోనే షూటింగ్‌ను ప్రారంభించనుంది. ఈ క్రమంలోనే తాజాగా ఈ మూవీకి సంబంధించి ఒక వీడియోను పంచుకున్నారు మేకర్స్. ఈ వీడియో చూస్తుంటే.. చిత్రయూనిట్ ఈ సినిమా సెట్ కోసమే రాత్రింబవళ్ళు కష్టపడినట్లు తెలుస్తుంది. మరోవైపు ఈ ప్రాజెక్ట్‌కు ‘వృష కర్మ’ అనే టైటిల్‌ను అనుకుంటున్నట్లు సమాచారం. కాగా ప్రస్తుతం వీడియో వైరల్‌గా మారింది.



## 40 ఏళ్ల హీరోతో రొమాన్స్ చేయబోతున్న తమన్నా

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ తమన్నా భాటియా టాలీవుడ్ స్టార్ హీరోలతో నటించి ఫుల్ ఫేమ్ తెచ్చుకుంది. ఇక అన్ని పాత్రలో సంప్రదాయంగా నటించిన ఆమె ‘లస్ట్ స్టోరీస్2’లో మరీ బోల్డ్‌గా నటించి అందరికీ షాకిచ్చింది. వరుస సినిమాల్లో నటిస్తూ ఫుల్ బిజీ బిజీగా గడుపుతోంది. అలాగే పలు చిత్రాల్లో స్పెషల్ సాంగ్స్ కూడా చేస్తోంది. ఇటీవల ‘ఓదెల2’ మూవీతో వచ్చిన ఆమె బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. ప్రస్తుతం సక్సెస్ ఎంజాయ్ చేస్తున్న మిల్కీ బ్యూటీ తెలుగు, హిందీ, సినిమాల్లో హీరోయిన్‌గానే కాకుండా స్పెషల్ సాంగ్స్ కూడా చేస్తోంది. తాజాగా, తమన్నా ఓ బంపర్ ఆఫర్ అందుకున్నట్లు సోషల్ మీడియాలో పలు పోస్టులు వైరల్ అవుతున్నాయి. ఈ అమ్మడు బాలీవుడ్ స్టార్ హీరో సిద్ధార్థ్ మల్హోత్రాతో జతకట్టబోతున్నట్లు సమాచారం. మూవీ మేకర్స్ కథ చెప్పడంతో మిల్కీ బ్యూటీ కూడా నటించేందుకు ఒప్పుకుని సంతకం చేసిందట. మైథలాజికల్ డ్రామాగా తెరకెక్కబోతున్న ఈ సినిమాకు దీపక్ మిశ్రా దర్శకత్వం వహిస్తున్నారు. అయితే ‘వివాన్’ పేరుతో రాబోతున్న ఈ చిత్రాన్ని ఏక్తా కపూర్ నిర్మిస్తున్నారు. ఈ మూవీ పౌరాణికనాటకం, ఉత్తర భారతదేశానికి చెందిన జానపద కథలకు వ్యతిరేకంగా రూపొందించబడుతోంది. అయితే షూటింగ్ జూన్‌లో మొదలుకాబోతున్నట్లు సమాచారం.





## రామ్ చరణ్ మైనపు విగ్రహం లాంచ్‌కి టైమ్ ఫిక్స్

చిరంజీవి తనయుడిగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ఒక్కో మెట్టు ఎక్కుతూ గ్లోబల్ స్టార్‌గా మారాడు. ఆర్‌ఆర్‌ఆర్ సినిమాతో రామ్ చరణ్ క్రేజ్ మరింతగా పెరిగింది. ఇప్పుడు బుచ్చిబాబు దర్శకత్వంలో పెద్ది అనే సినిమా చేస్తున్నాడు చెర్రీ. ఈ చిత్రం బాక్సాఫీస్ దగ్గర బడా విజయం సాధించడం ఖాయం అని అంటున్నారు. ఇందుకు కారణం ఇటీవల పెద్ది గ్లింప్స్ రిలీజ్ కాగా, ఈ టీజర్ మూవీపై భారీ అంచనాలు పెంచింది. గ్లింప్స్ లో ప్రతి షాట్ కూడా అభిమానుల మనసులని ఎంతగానో ఆకట్టుకుంది. ఈ సినిమా రామ్ చరణ్ కెరీర్‌లోనే బెస్ట్ మూవీ కావడం ఖాయం అని అంటున్నారు.ఇక ఇదిలా ఉంటే గ్లోబల్ స్టార్‌గా మారిన రామ్ చరణ్ మైనపు విగ్రహాన్ని మేడం టుస్సాడ్స్ మ్యూజియంలో ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మే 9న లండన్‌లోని మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియంలో చరణ్ మైనపు విగ్రహాన్ని లాంఛ్ చేయనున్నారు. ఆ తర్వాత ఆ విగ్రహాన్ని శాశ్వతంగా సింగపూర్ టుస్సాడ్స్ మ్యూజియంకు తరలిస్తారు. రామ్ చరణ్‌కి ఈ అరుదైన గౌరవం దక్కడం పట్ల ఫ్యాన్స్‌తో పాటు సినీ ప్రియులు కూడా తెగ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## ట్రెండీ వేర్ లో వైష్ణవి చైతన్య గ్లామర్ షో

బ్లాక్ బస్టర్ చిత్రం ‘బేబీ’తో తెలుగు ప్రేక్షకుల హృదయాలను కొల్లగొట్టిన వైష్ణవి చైతన్య, తన నటనతోనే కాకుండా తన అద్భుతమైన ఫ్యాషన్ ఎంపికలతోనూ అందరినీ ఆకట్టుకుంటోంది. సాంప్రదాయ చీరల నుండి నేటితరం ట్రెండీ దుస్తుల వరకు, వైష్ణవి తన స్టైల్ పరిధిని విస్తృతంగా చాటుకుంటోంది. సోషల్ మీడియాలో ఆమె షేర్ చేస్తున్న లేటెస్ట్ క్లాత్స్ ఆమె ఫ్యాషన్ పరంపరకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. తాజాగా, వైష్ణవి ఒక ప్రత్యేకమైన లుక్‌లో కనిపించి అందరి దృష్టిని ఆకర్షించింది. బాడీరూచ్డ్ డిజైన్‌తో ఉన్న పొడవాటి దుస్తుల్లో ఆమె నిజంగా కిల్లర్ లుక్ లో కనిపించింది. ఆమె ఒత్తైన, ఉంగరాల జుట్టును విరబోసి, డార్క్ బ్రౌన్ రంగు లిప్‌స్టిక్‌తో తన అందానికి మరింత కాంతిని తీసుకువచ్చింది. చేతికి ధరించిన సిల్వర్ కోటెడ్ గాజులు ఆమె దుస్తులకు ఒక ప్రత్యేకమైన మెరుపును తీసుకొచ్చాయి.ఇటీవల, వైష్ణవి సిద్ధు జొన్నలగడ్డతో కలిసి ‘జాక్’ అనే చిత్రంలో నటించింది. దురదృష్టవశాత్తూ ఈ చిత్రం ఆశించిన విజయాన్ని సాధించలేకపోయింది. అయితే, వైష్ణవి తన తదుపరి చిత్రం ‘యాన్ అన్‌ఫినిష్డ్ స్టోరీ’తో మళ్లీ ప్రేక్షకులను అలరించడానికి సిద్ధంగా ఉంది. తన అందం, అభినయంతో వైష్ణవి చైతన్య టాలీవుడ్‌లో ఒక ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకుంటుందనడంలో ఎలాంటి సందేహం లేదు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR: PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999